# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచిక : 105 | గురువారం 18, డిసెంబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


MHR TV

## మూడో దశలోనూ
# హస్తం ఆధిపత్యం



**అత్యధిక స్థానాలు కాంగ్రెస్ మద్దతుదారులకే**

**రెండో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్**

**మూడో స్థానంలో బీజేపీ మద్దతు దారులు**

**రాష్ట్రంలో అక్కడక్కడా గట్టి పోటీ ఇచ్చిన గులాబీ పార్టీ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశలోనూ కాంగ్రెస్ పార్టీ తన హవా కొనసాగించింది. మొదటి, రెండు దశల్లో ఇప్పటికే కాంగ్రెస్ సత్తా చాటిన విషయం తెలిసిందే. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ..మిగతా 2లో



# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు
# బిగ్ రిలీఫ్

**అనర్హత పిటిషన్లు కొట్టేసిన స్పీకర్**

**ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు నిరూపించే ఆధారాలు లేవు**

**వీళ్లంతా సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే..**

**తెలంగాణ స్పీకర్ సంచలన తీర్పు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ డిసెంబర్ 17, 2025 బుధవారం నాడు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై కీలక తీర్పు వెలువరించారు. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు - తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల్), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), టి. ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి) - పై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ పూర్తిగా కొట్టివేశారు. స్పీకర్ తన తీర్పులో ..మిగతా 2లో


03

## తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ

**రాజ్యాంగంపై రాహుల్ గాంధీకి గౌరవం లేదా?**

**ఉంటే ఫిరాయింపులను ఎలా ప్రోత్సహిస్తారు?**

**దేశవ్యాప్తంగా రాజ్యాంగం పుస్తకాలు పట్టుకొని తిరుగుతారు**

**మరి తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి ఏమైంది?**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు
# ఘన స్వాగతం



**శీతాకాల విడిదికోసం హైదరాబాద్‌కు రాష్ట్రపతి**

**స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటీ సీఎం**

**22 వరకు రాష్ట్రపతి శీతాకాల పర్యటన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

శీతాకాలం విడిది సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రానికి వచ్చిన రాష్ట్రపతికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు ..మిగతా 2లో

## వచ్చే ఏడాదిలోనే జీహెచ్ఎంసీ ఎన్నికలు

ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని మౌఖిక ఆదేశాలు

అందుకే వేగవంతంగా విలీనం, డీలిమిటేషన్ ప్రక్రియ

జూబ్లీహిల్స్, పంచాయతీ ఎన్నికల ఫలితాలతో జోష్ లో కాంగ్రెస్

పాలక మండలి అధికార గడువు ఫిబ్రవరి 10 న పూర్తి

ఆ తర్వాతే వార్డుల ఫైనల్ నోటిఫికేషన్, రిజర్వేషన్లపై కసరత్తు



03

## తెలంగాణలో మరో డిస్కం



**ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం**

**మూడో విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చేయనున్న సర్కారు**

**సంక్షేమ పథకాల నిర్వహణ, ఆర్థిక స్థిరత్వం లక్ష్యం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో మరో ముఖ్యమైన సంస్కరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఉన్న తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్, నార్దర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌లతో పాటు మూడో డిస్కంను ఏర్పాటు చేయడానికి మంత్రివర్గం ..మిగతా 2లో

## మరో ఆరు నెల్లలో ఏడాదిలోనో ఎన్నికలు రావచ్చు

**కాంగ్రెస్ కు దిమ్మతిరిగే ఫలితాలు**

**ప్రజాపాలనలో పల్లెలకు అవార్డులు బంద్.. అభివృద్ధి బంద్**

**ఓటమి భయంతోనే డబ్బు సంచులు, పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రలోభాలు**

**వచ్చేది వన్ నేషన్ వన్ ఎలక్షన్..**

**రెండు ఏండ్లలో మళ్ళీ కేసీఆర్ సీఎం కావడం ఖాయం**

**మాజీ మంత్రి హరీష్ రావు**

02


03

## ఏమిటీ కాలుష్యం

**ఢిల్లీ నగరం నరకంలా మారుతోంది**

**సుప్రీంకోర్టు తీవ్ర అసహనం**

**టోల్ ప్లాజాలు మూసేయాలంటూ ఆదేశం**

**నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచన**

**శాశ్వత పరిష్కారాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశం**



03

## భారత్ ట్యాక్సీ గేమ్ చేంజర్

**ఓలా, ఉబర్, ర్యాపిడోలకు గట్టి పోటీ**

**జనవరి 1 నుంచి ఢిల్లీలో ప్రారంభం**

**వినియోగదారులకు తక్కువ ధరకే ప్రయాణం**

**కస్టమర్లు చెల్లించిన మొత్తంలో 99 శాతం డ్రైవర్లకే**

**లాభాల్లో డ్రైవర్లకు వాటాలు..**

**కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకం**

www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM



# తెలంగాణలో మరో డిస్కం

**మొదటిపేజీ తరువాయి**

ఆమోదం తెలిపింది. ఈ మూడో డిస్కం ప్రధానంగా సంక్షేమ పథకాల కింద అందిస్తున్న ఉచిత విద్యుత్ సరఫరాను నిర్వహించనుంది. డిసెంబర్ 17, 2025 నాటి సమాచారం ప్రకారం, ఈ కొత్త డిస్కంకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది.

**నేపథ్యం**

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. 2015లో 6,755 మెగా వాట్స్ ఉన్న పీక్ డిమాండ్ 2025 మార్చి నాటికి 17,165 మెగా వాట్స్ కు చేరుకుంది. 203435 నాటికి ఇది 31,809 MWకు పెరిగే అంచనా ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత రెండు డిస్కంలు ఆర్థికంగా భారీ నష్టాలు (సుమారు రూ.59,671 కోట్లు) ఎదుర్కొంటున్నాయి. సంక్షేమ పథకాల వల్ల వచ్చే భారం (సబ్సిడీలు సంవత్సరానికి రూ.14,000 కోట్లకు పైగా) ఈ డిస్కంల ఆర్థిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జులై 2025లో మొదలైన చర్చలు నవంబర్ 25, 2025న మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొందాయి. కొత్త డిస్కం రాష్ట్రవ్యాప్తంగా ఒకే యూనిట్‌గా పనిచేస్తుంది. దీని ముఖ్య ఉద్దేశాలు:

వ్యవసాయానికి ఉచిత విద్యుత్, గృహజ్యోతి పథకం కింద పేద గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ప్రభుత్వ పాఠశాలలుకళాశాలలకు ఉచిత సరఫరా వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహించడం.

లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, సురక్షిత మంచినీటి సరఫరా, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై & సీవరేజ్ బోర్డ్ (HMWSSB) కనెక్షన్లు వంటి రంగాలకు సరఫరా.

ప్రస్తుత డిస్కంల నుంచి సుమారు రూ.36,000 కోట్ల రుణభారాన్ని తీసుకుని, వాటి క్రెడిట్ రేటింగ్‌లను మెరుగుపరచడం.

విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత, ఆపరేషనల్ ఎఫిషియెన్సీ పెంచడం.

కొత్త డిస్కంలో సుమారు 28.9 లక్షల కనెక్షన్లు (ముఖ్యంగా వ్యవసాయ పంప్‌సెట్లు), సంబంధిత డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు బదిలీ అవుతాయి. దీనికి చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సుమారు 2,000 మంది ఉద్యోగులు అవసరమవుతారు.

**మార్గదర్శకాలు మరియు అమలు**

ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆస్తులు, సిబ్బంది విభజన, పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు (PPAలు), బకాయిలు, నిధుల కేటాయింపు స్పష్టంగా నిర్ణయించబడతాయి. కొత్త డిస్కం ఏర్పాటుతో ప్రస్తుత డిస్కంలు వాణిజ్య, ఆదాయాధారిత సేవలపై దృష్టి పెట్టి, జాతీయ ర్యాంకింగ్‌లు మెరుగుపరుచుకునే అవకాశం. రుణాలపై అధిక వడ్డీ భారం (10% వరకు) తగ్గించి, 6% స్థాయికి రీస్ట్రక్చర్ చేయడం ద్వారా ఆర్థిక భారం తగ్గనుంది. ఈ చొరవ జనవరి 2026 నాటికి పూర్తి అమలులోకి రానుంది. ప్రభుత్వం ఈ సంస్కరణలతో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు అనుగుణంగా ఈ నిర్ణయం కీలకమైనదిగా అధికారులు అభివర్ణిస్తున్నారు.

# మూడో దశలోనూ హస్తం ఆధిపత్యం

**మొదటిపేజీ తరువాయి**



ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. మొత్తం 12,728 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు (ఏకగ్రీవాలు, పోటీ జరిగినవి కలిపి). ఈ ఎన్నికలు పార్టీలు లేకుండా జరిగినప్పటికీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ (బీఆర్ఎస్), బీజేపీలు తమ మద్దతుదారులను బరిలో దించాయి.

తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశలుగా (డిసెంబర్ 11, 14, 17) ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 12,728 సర్పంచ్ స్థానాలకు, 1, 12, 242 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా, పార్టీలు అధికారికంగా పోటీ చేయకపోయినా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ మద్దతుదారులను బరిలోకి దించాయి. ఫలితాల్లో అధికార కాంగ్రెస్ ఆధిక్యం స్పష్టంగా కనిపిస్తోంది.

**తొలి దశ (డిసెంబర్ 11):**

పోలింగ్ శాతం: 84.28%
పోటీ జరిగిన సర్పంచ్ స్థానాలు: సుమారు 3,834

**- ఫలితాలు (ప్రకటిత స్థానాల్లో):**

కాంగ్రెస్ మద్దతుదారులు: 1,924 స్థానాలు
బీఆర్ఎస్ మద్దతుదారులు: 975 స్థానాలు
బీజేపీ మద్దతుదారులు: 156 స్థానాలు
ఇతరులు/స్వతంత్రులు: 428 స్థానాలు

**రెండో దశ (డిసెంబర్ 14):**

పోలింగ్ శాతం: 85.86%
పోటీ జరిగిన సర్పంచ్ స్థానాలు: సుమారు 4,333

**ఫలితాలు:**

కాంగ్రెస్ మద్దతుదారులు: 2,216 స్థానాలు
బీఆర్ఎస్ మద్దతుదారులు: 1,177 స్థానాలు
బీజేపీ మద్దతుదారులు: 259 స్థానాలు
ఇతరులు/స్వతంత్రులు: 619 స్థానాలు

**పోలింగ్ శాతం: 80.78%**

పోటీ జరిగిన సర్పంచ్ స్థానాలు: 3,752 (వార్డు మెంబర్లు: 28,410)
ఫలితాలు (ప్రకటితమైన 2,159 స్థానాల వరకు):

కాంగ్రెస్ మద్దతుదారులు: 1,239 స్థానాలు
బీఆర్ఎస్ మద్దతుదారులు: 567 స్థానాలు
బీజేపీ మద్దతుదారులు: 102 స్థానాలు
ఇతరులు: 263 స్థానాలు

**ఆసక్తికరమైన ఘటనలు**

భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామంలో రాజకీయ నాయకుల పేర్లతో ఉన్న అభ్యర్థుల మధ్య పోరు ఆకర్షణీయంగా సాగింది. బీఆర్ఎస్ మద్దతుదారు బానోతు జగన్‌పై కాంగ్రెస్ మద్దతుదారు భూక్యా చంద్రబాబు విజయం సాధించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ముసలాయిపల్లి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి పవిత్ర నాగరాజ్ ఒక్క ఓటు మెజారిటీతో సర్పంచ్‌గా గెలిచారు.

భద్రాద్రి జిల్లా గాంధీనగర్‌లో కాంగ్రెస్ మద్దతుదారు బానోతు మంగీలాల్ 3 ఓట్ల తేడాతో, నిజామాబాద్ జిల్లా బాన్సువాడ మండలం నాగారంలో దౌల్తాపూర్ గీత 7 ఓట్ల తేడాతో, కామారెడ్డి జిల్లా జగన్నాథ్‌పల్లిలో గోడండ్ల వెంకయ్య 8 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ ఎన్నికలు పార్టీలు లేకుండా జరిగినప్పటికీ, ఫలితాలు రాష్ట్ర రాజకీయాలకు సూచికగా నిలుస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వంటివి పల్లెల్లో మద్దతు తెచ్చిపెట్టాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బీఆర్ఎస్ మాత్రం తమ బలమైన గ్రామీణ నెట్‌వర్క్‌తో పోటీ ఇచ్చింది. మూడో దశ కౌంటింగ్ పూర్తయిన తర్వాత మొత్తం చిత్రం స్పష్టమవుతుంది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టు నిరూపించే తగిన ఆధారాలు పిటిషనర్లు (బీఆర్ఎస్ నాయకులు) సమర్పించలేదు. ఫలితంగా, ఫిరాయింపు నిరోధక చట్టం (10వ షెడ్యూల్) ఈ కేసులో వర్తించదు. సాంకేతికంగా ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు ఇప్పటికీ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సభ్యులుగానే కొనసాగుతారని స్పీకర్ నిర్ధారించారు. ఈ నిర్ణయం కాంగ్రెస్ వర్గాలకు ఊరట నిచ్చింది, అయితే బీఆర్ఎస్‌కు ఊహించని ఎదురుదెబ్బగా మారింది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు 2024లో కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు ఆరోపణలు వచ్చాయి.

దానం నాగేందర్ (ఖైరతాబాద్)
కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్)
పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ)
ఎం సంజయ్ కుమార్ (జగిత్యాల)
కాలే యాదయ్య (చేవెళ్ల)
మరియు పైన పేర్కొన్న ఐదుగురు.

ఈ ఫిరాయింపులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు (కేటీఆర్, పడి కౌశిక్ రెడ్డి వంటివారు) అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. అయితే స్పీకర్ నిర్ణయం ఆలస్యమవుతుండటంతో బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు పలుమార్లు స్పీకర్‌ను హెచ్చరించింది. జులై 31, 2025న మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. నవంబర్ 17, 2025న ఆలస్యానికి ధిక్కార నోటీసు జారీ చేసి, నాలుగు వారాల్లో (డిసెంబర్ 18 వరకు) తేల్చాలని ఆదేశించింది. ఈ ఒత్తిడి నేపథ్యంలో స్పీకర్ విచారణలు వేగవంతం చేసి, ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేశారు.

**మరో ముగ్గురిపై రేపు తీర్పు**

పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్ - పై గురువారం (డిసెంబర్ 18) తీర్పు రానుంది.



దానం నాగేందర్, కడియం శ్రీహరి పై విచారణ ఇంకా పూర్తి కాలేదు (వీరు నోటీసులకు స్పందించలేదు లేదా మరింత సమయం కోరారు). బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై డిసెంబర్ 19, 2025న మరోసారి విచారణ జరగనుంది. ఈ తీర్పు తర్వాత బీఆర్ఎస్ మరిన్ని చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. ఎందుకంటే ఫిరాయింపు నిరోధక చట్టం అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.





# రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఘన స్వాగతం

**మొదటిపేజీ తరువాయి**

శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

హైదరాబాద్‌లో రాష్ట్రపతి పలు రోజుల పాటు ఉండనున్నారు. ఈ నెల 18న రాష్ట్రపతి నిలయంలో విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం 19న రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. ఆ కార్యక్రమాల్లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నట్లు సమాచారం.

20న గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాల్గొననున్నారు. ఆధ్యాత్మికత, విలువలపై దృష్టి సారించిన ఈ కార్యక్రమాల్లో ఆమె ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. 21న రాష్ట్రపతి నిలయంలో పౌరులతో భేటీ కార్యక్రమం అలాగే 'అట్ హోమ్' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులతో ఆమె మమేకమై అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. హైదరాబాద్ పర్యటన పూర్తయిన అనంతరం 22న సాయంత్రం రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు.

# ఎమ్మార్వో చొరవతో కదిలిన పెందుర్తి రెవిన్యూ యంత్రాంగం.

**పెందుర్తి, డిసెంబర్ 17(ప్రజాస్వరం):**

ఇటీవల పలు పత్రికల్లో వచ్చిన వార్తలకు సానుకూలంగా స్పందించిన పెందుర్తి ఎమ్మార్వో తన కార్యాలయ సిబ్బందితో చిన్నముషిడివాడ సర్వేనెంబర్ 113 లో ఆక్రమణ తొలగింపును సమర్థవంతంగా పూర్తి చేశారు. జీవీఎంసీ 97 వార్డు చిన్న ముషిడివాడ సర్వే నెంబరు 113 లో ఆక్రమణలను రెవిన్యూ అధికారులు దగ్గరుండి తొలగించారు. సర్వేనెంబర్ 113 లోని అసైన్డ్ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి చుట్టూ ప్రహారీ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. దాదాపు 5 కోట్ల రూపాయలు విలువ గల ఆ భూమిని కాజేసేందుకు పక్కా ప్రణాళికతో ఆక్రమణదారులు ప్రయత్నాలు సాగించారు. దీనిపై స్థానికులు పలుమార్లు ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. అలాగే ప్రజాస్వరం పత్రికలో భూఆక్రమణపై వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై తొలుత ఎమ్మార్వో ఆ భూమికి పత్రాలు ఉన్నాయంటూ పేర్కొని, తరువాత నిశిత పరిశీలన చేసి అది ప్రభుత్వ భూమిగానే నిర్ధారణ చేశారు. అయితే పూర్తి ఆధారాలతో పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమవడంతో పెందుర్తి రెవిన్యూ అధికారులు దీనిని కూలంకుషంగా పరిశీలించి స్పందించారు. బుధవారం ఉదయం రెవిన్యూ అధికారులు సర్వేనెంబర్ 113 లో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడని తొలగించారు. దీంతో స్థానికల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవడమే కాకుండా పత్రికల్లో వచ్చిన వార్తల పట్ల వారి స్పందనను ప్రజలంతా హర్షిస్తున్నారు.



### మరో ఆరు నెలల్లోనో ఏడాదిలోనో

# ఎన్నికలు రావచ్చు

- కాంగ్రెస్ కు దిమ్మతిరిగే ఫలితాలు
- ప్రజాపాలనలో పల్లెలకు అవార్డులు బంద్.. అభివృద్ధి బంద్
- ఓటమి భయంతోనే డబ్బు సంచులు, పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రలోభాలు
- వచ్చేది వన్ నేషన్ వన్ ఎలక్షన్.. రెండు ఏండ్లలో మళ్ళీ కేసీఆర్ సీఎం కావడం ఖాయం
- మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

దేశం వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా వెళ్తోంది. బహుశా మరో ఆరు నెలల్లోనో ఏడాదిలోనో ఎన్నికలు రావచ్చు అని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే ఫలితాలు వచ్చాయి.. ప్రజల తీర్పు చూసి కాంగ్రెస్ నాయకులకు షాక్ తగిలిందని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలం మల్కాపూర్, కోనైపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో గెలిచిన సర్పంచులు, అలాగే అచ్చంపేట నియోజకవర్గం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత మండలం వంగూరులో 10 గ్రామ పంచాయతీల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ సర్పంచులు బుధవారం హైదరాబాద్ లో హరీష్ రావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచులను ప్రత్యేకంగా అభినందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. మొదటి దఫా ఫలితాలు చూసి షాక్ అయ్యారు..రెండో దఫా ఫలితాలు చూసి మైండ్ బ్లాక్ అయ్యింది... మూడో దశ ఫలితాలు కూడా కాంగ్రెస్ పార్టీకి నిరాశ అన్నారు.ఈ ఓటమి భయంతోనే ఇప్పుడు డబ్బు సంచులు పట్టుకొని హైదరాబాద్ నుండి బయలుదేరారు.. పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో తూప్రాన్ మండలమే కాదు రాష్ట్రం మొత్తం అద్భుతంగా అభివృద్ధి చెందింది. తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి..నాడు ఢిల్లీలో అవార్డులు ఇస్తే తెలంగాణ పల్లెల పేర్లు లేకుండా జాబితా ఉండేది కాదు. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో తెలంగాణకు ఒక్క అవార్డు కూడా రాలేదు... పల్లెలు అపరిశుభ్రంగా మారాయి. కనీసం కేసీఆర్ కొనిచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోసే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదు అన్నారు. ఆనాడు కేసీఆర్ ప్రతి నెలా పల్లెలకు నిధులు విడుదల చేసేవారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు బంద్ అయ్యాయన్నారు. పల్లె ప్రకృతి వనాలు, డంపు యార్డులు అన్నీ మూలకు పడ్డాయి. అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు కాబట్టే.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ నాయకులను నేను హెచ్చరిస్తున్నా.. మా కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు అని హెచ్చరించారు. దాడులు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. బీఆర్ఎస్ లో గెలిచిన వారిని బలవంతంగా పార్టీలో చేర్చుకోవాలని చూసినా కుదరదు.. ఎందుకంటే బీఆర్ఎస్ కార్యకర్తలు ఉద్యమకారులని గుర్తుంచుకోండి. వారు మీ బెదిరింపులకు లొంగరు అని స్పష్టం చేశారు. రెండేళ్లలో కచ్చితంగా మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మళ్ళీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారు..గెలిచిన సర్పంచులంతా ధైర్యంగా ఉండండి. మళ్ళీ గ్రామాలకు మంచి రోజులు వస్తాయి. అభివృద్ధి పథంలో మన గ్రామాలన్నీ ప్రయాణిస్తాయని దీమా వ్యక్తం చేశారు.

### ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ స్పీకర్ తీర్పు పై మాజీ మంత్రి హరీశ్ రావు

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ అని, రాహుల్ గాంధీ "సేవ్ ది కానిస్టిట్యూషన్" నినాదం, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పుతో నేడు పూర్తిగా బహిర్గతమైందని, రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ సంస్థలను కూడా దిగజార్చడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. బుధవారం మీడియా ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా దెబ్బతీసిన ఈ ఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీ-డిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి, అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం – ఇది రాజ్యాంగాన్ని కాలరాయడమే అన్నారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికతపై గొప్ప ఉపన్యాసాలు ఇస్తూ, తెలంగాణలో మాత్రం అదే రాజ్యాంగాన్ని నిర్లజ్జగా ధిక్కరించడం – ఇదీ కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీల నిజస్వరూపం అన్నారు. "సేవ్ ది కానిస్టిట్యూషన్" నినాదం మాటలకే పరిమితమై, ఆచరణలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారన్నారు. ఇది ఎంతో సిగ్గుచేటు అన్నారు.

# తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ

- రాజ్యాంగంపై రాహుల్ గాంధీకి గౌరవం లేదా?
- ఉంటే ఫిరాయింపులను ఎలా ప్రోత్సహిస్తారు?
- దేశవ్యాప్తంగా రాజ్యాంగం పుస్తకాలు పట్టుకొని తిరుగుతారు
- మరి తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి ఏమైంది?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పక్కా ఆధారాలు ఉన్నా స్పీకర్ తప్పుడు తీర్పు ఇచ్చారని వాపోయారు. ఫిరాయింపులను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఇంత జరుగుతుంటే రాహుల్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగం పుస్తకాలు పట్టుకొని తిరిగే కేటీఆర్.. తెలంగాణలో రాజ్యాంగం అమలవుతుందా? లేదా? చూసుకోవడం లేదా? అంటూ ఫైర్ అయ్యారు.

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం (బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. పార్టీ మారినట్లు తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా ఈ ఎమ్మెల్యేలు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు పేర్కొంటూ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నిర్ణయం కాంగ్రెస్ పార్టీకి ఊరట నిచ్చినప్పటికీ, బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. అనర్హత వేటు నుంచి ఊరట లభించిన ఐదుగురు ఎమ్మెల్యేలు: భద్రాచలం నియోజకవర్గం నుంచి తెల్లం వెంకట్రావు, గద్వాల్ నుంచి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాజేంద్రనగర్ నుంచి టీ. ప్రకాశ్ గౌడ్, పటాన్‌చెరు నుంచి గూడెం మహిపాల్ రెడ్డి, సేరిలింగంపల్లి నుంచి అరికెపూడి గాంధీ. మొత్తం 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి, 2024లో కాంగ్రెస్‌లో చేరినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిలో మిగతా వారిపై నిర్ణయం త్వరలో వెలువడే అవకాశం ఉంది.

సుప్రీంకోర్టు ఒత్తిడి నేపథ్యంలో ఈ తీర్పు వెలువడింది. బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై నిర్ణయం ఆలస్యం కావడంతో సుప్రీంకోర్టు స్పీకర్‌పై కంటెంప్ట్ ఆఫ్ కోర్టు హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబర్ 18లోపు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో స్పీకర్ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఈ తీర్పు ప్రకటించారు.

**కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**

ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు (కేటీఆర్) తీవ్రంగా స్పందించారు. "అసెంబ్లీ సాక్షిగా ఇవాళ ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ నిలువునా ఖూనీ చేసింది" అని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానాలపైనే కాదు, చివరికి రాజ్యాంగంపై కూడా రాహుల్ గాంధీకి ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి ఫిరాయింపులకు తెరలేపిన నాటి నుంచి నేటి స్పీకర్ నిర్ణయం వరకు కాంగ్రెస్ రాజ్యాంగాన్ని అడుగడుగునా అపహాస్యం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు స్వయంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలే అనేకసార్లు ప్రకటించినా వారిని కాపాడటం రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని విమర్శించారు.

"కేవలం ఫోటోలకు పోజులిచ్చేందుకు చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదు. తండ్రి (రాజీవ్ గాంధీ) చేసిన చట్టాన్నే (ఫిరాయింపు నిరోధక చట్టం) గౌరవించలేని అసమర్థ నాయకుడిగా రాహుల్ గాంధీ చరిత్రలో మిగిలిపోతారు" అని ధ్వజమెత్తారు. పంచాయతీ ఎన్నికల్లో రేవంత్ పాలనా వైఫల్యాలపై పల్లెపల్లెనా వెల్లువెత్తుతున్న ప్రజావ్యతిరేకతకు భయపడి కాంగ్రెస్ ఉప ఎన్నికలకు జంకుతోందని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోకపోవడానికి ఇదే ప్రధాన కారణమని, తెలంగాణ సమాజానికి ఇది స్పష్టంగా అర్థమైపోయిందని విమర్శించారు. గోడ దూకిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తాత్కాలికంగా కాపాడినట్లు కాంగ్రెస్ అనుకున్నా, ప్రజాస్వరంలో వారిని ఎమ్మెల్యే పదవికి అనర్హులుగా ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎప్పుడో ప్రకటించేశారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే అవకాశం ఉంది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ ఘటన మరిన్ని చర్చలకు దారితీస్తుంది.

# వచ్చే ఏడాదిలోనే జీహెచ్ఎంసీ ఎన్నికలు

- ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని మౌఖిక ఆదేశాలు
- అందుకే వేగవంతంగా విలీనం, డీలిమిటేషన్ ప్రక్రియ
- జూబ్లీహిల్స్, పంచాయతీ ఎన్నికల ఫలితాలతో జోష్ లో కాంగ్రెస్
- పాలక మండలి అధికార గడువు ఫిబ్రవరి 10 న పూర్తి
- ఆ తర్వాతే వార్డుల ఫైనల్ నోటిఫికేషన్, రిజర్వేషన్లపై కసరత్తు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధితో పాటు మహానగరవాసులకు పౌర, అత్యవసర సేవల నిర్వహణలో కీలక పాత్ర పోషించే జీహెచ్ఎంసీ పాలక మండలి వచ్చే ఫిబ్రవరి 10తో గడువు ముగియనుండటంతో ఇప్పట్లో మళ్లీ బల్దియాకు ఎన్నికలు జరుగుతాయా? అన్న సస్పెన్షన్ కు తెరపడినట్టే. ఫిబ్రవరిలో పాలక మండలి గడువు ముగిన నాలుగైదు నెలల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని సర్కారు భావిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సిటీలో చెప్పుకోదగిన స్థాయిలో సీట్లు లేని అధికార పార్టీ ప్రస్తుత పాలక మండలి అధికార గడువు ముగిసి, ఏడాది గడిచిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని, అంతలోపు సిటీలో మార్కు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని భావించింది. కానీ గత నెల 11వ తేదీన జరిగిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా విజయం సాధించటంతో ఆ పార్టీ క్యాడర్ లో జోష్ పెరిగింది. వాస్తవానికి అధికార కాంగ్రెస్ పార్టీకి హైదరాబాద్ నగరంలో ఒక్క సీటు కూడా లేని సమయంలో కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆ పార్టీ సాధించిన విజయం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో క్యాడర్ లో జోష్ నింపిందని చెప్పవచ్చు. జూబ్లీహిల్స్ విజయోత్సవంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కొద్ది రోజుల క్రితం వరకు మూడు విడతలుగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అంచనాలను మించి సర్పంచ్ సీట్లను కైవసం చేసుకోవటంతో రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీకి ఆదరణ పెరగటంతో పాటు అనుకూలమైన పరిస్థితులున్నాయన్న విషయాన్ని విశ్లేషించిన సర్కారు ఇదే ఊపు తో త్వరలోనే ఎంపీటీసీ, ఆ తర్వాత జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి మరింత సత్తా చాటేందుకు సిద్దమైనట్లు సమాచారం. ఆ తర్వాత మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించినానంతరం రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో విజయం సాధించి, అదే స్పూర్తితో జీహెచ్ఎంసీ ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం, వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియ హడావుడిగా సాగటమే ఇందుకు బలాన్ని చేకూరుస్తుంది. ముఖ్యంగా పాత జీహెచ్ఎంసీలోని 150 వార్డులతో కలిపి విలీన పట్టణ స్థానిక సంస్థల పరిధిని కలుపుకుని పునర్విభజించిన 300 వార్డులకు వచ్చే సంవత్సరం జూలై, ఆగస్టు మాసంలోనే ఎన్నికలు నిర్వహించాలని, ఇందుకు సర్కారు జీహెచ్ఎంసీకి మౌఖికంగా ఆదేశాలు జారీ చేయటం వల్లే జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు వార్డుల డీలిమిటేషన్ పై వన్ పాయింట్ గా వర్కవుట్ చేస్తున్నట్లు సమాచారం. వచ్చే సంవత్సరం సెన్సస్ జరగనున్నందున జీహెచ్ఎంసీ అధికారులు డీలిమిటేషన్ ప్రక్రియను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్న టార్గెట్ పెట్టుకున్నట్లు సమాచారం. వార్డుల ఫైనల్ నోటిఫికేషన్ కు ఆమోదం, వార్డుల రిజర్వేషన్ల ఖరారుతో పాటు జీహెచ్ఎంసీని యదావిధిగా కొనసాగించాలా? లేక రెండు, మూడు ముక్కలు చేయాలా? అన్ని విషయంపై సర్కారు నిర్ణయం తీసుకునే లోపు ప్రస్తుత పాలక మండలి అధికార గడువు ముగియనున్నందున, ఆ తర్వాతే జీహెచ్ఎంసీ కొనసాగింపు, ఎన్నికలకు సంబంధించి సర్కారు కీలకమైన నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం.




**డీలిమిటేషన్ ఫైనల్ నోటిఫికేషన్ తర్వాతే వార్డుల రిజర్వేషన్లు**

సర్కారు మౌఖిక ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రయాణంలో అధికారులు ఇప్పటి వరకు 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం, మున్సిపల్ వార్డుల డీలిమిటేషన్ ముసాయిదాను సిద్ధం చేసి, ప్రస్తుతం డీలిమిటేషన్ పై అభ్యంతరాలు, సలహాలను స్వీకరిస్తున్నారు. అధికారులు ముందుగా ఫిక్స్ చేసుకున్న నిర్ణయం మేరకు ఈ నెల 17వ తేదీ సాయంత్రం అయిదు గంటలతో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగియనున్నందున, డీలిమిటేషన్ పై కొందరు కోర్టును ఆశ్రయించటంతో పిటీషనర్ అభ్యర్థన మేరకు అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు కోర్టు రెండు రోజుల గడువును పెంచుతూ ఉత్తర్వులిచ్చినట్లు సమాచారం. దీంతో వార్డు డీలిమిటేషన్ పై జీహెచ్ఎంసీ అధికారులు ఈ నెల 19 వరకు అభ్యంతరాలు, సలహాలను స్వీకరించనున్నారు. ఆ తర్వాత వాటిని డిస్పోజ్ చేసి ఫైనల్ నోటిఫికేషన్ ను ఆమోదం కోసం సర్కారుకు పంపనున్నట్లు తెలిసింది. ఫైనల్ నోటిఫికేషన్ కు సర్కారు ఆమోద ముద్ర వేయగానే ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ, 300 వార్డుల రిజర్వేషన్లను ఖరారుకు ఆదేశాలివ్వనున్నట్లు సమాచారం. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఎలక్షన్ వింగ్ అధికారులు సమష్టిగా కసరత్తు చేసి, కేవలం 15 రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు, ఆ తర్వాత ప్రజల నుంచి మరోసారి రిజర్వేషన్లపై అభ్యంతరాలను ఖరారు చేసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ జారీ చేసే అవకాశమున్నట్లు సమాచారం.

**ఒకే కార్పొరేషన్ గా జీహెచ్ఎంసీ?**

కొద్ది రోజుల క్రితం వరకు 650 చదరపు కిలోమీటర్లు, 30 సర్కిళ్లు, ఆరు జోన్లుగా ఉన్న జీహెచ్ఎంసీ లోకి 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయటంతో పరిధి కాస్త 2 వేల 50 కిలోమీటర్లకు పెరిగింది. ఈ పరిధి మొత్తాన్ని అధికారులు ఇప్పటికే 300 మున్సిపల్ వార్డులుగా పునర్విభజించిన సంగతి తెల్సిందే. ప్రస్తుతం ముసాయిదా స్థాయిలో ఉన్న ఈ వార్డులు ఫైనల్ అయితే 300 వార్డులతో జీహెచ్ఎంసీని ఒకే కార్పొరేషన్ గా సర్కారు కొనసాగిస్తుందా? లేక రెండు, మూడు ముక్కలుగా చేస్తుందా? అన్న సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పరిపాలన, స్థానిక అభివృద్ధి కోసం సర్కారు మూడు ముక్కలు చేసినా, ఆశ్చర్యం లేదని కొందరు ఉన్నతాధికార వర్గాల సమాచారం. ముంబై తరహాలో మెరుగైన పౌర సేవల నిర్వహణ, వేగవంతంగా అభివృద్ధి కోసం రెండు లేక మూడు కార్పొరేషన్లుగా విభజించే అవకాశమున్నట్లు తెలిసింది. ఒక వేళ సర్కారు జీహెచ్ఎంసీగానే కొనసాగిస్తే దేశంలోనే అతి పెద్ద సిటీగా హైదరాబాద్ రికార్డు సృష్టిస్తుందన్న చర్చ కూడా లేకపోలేదు.

# మహాలింగాపురం గ్రామ సర్పంచ్ గా రాఘవేందర్ రెడ్డి.

- అన్ని వర్గాలను కలుపుకొని గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తా.

**శంకర్ పల్లి డిసెంబర్ 17(ప్రజాస్వరం):**



రెండవ దశ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మహాలింగాపురం గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లలో మాచన్న గారి రాఘవేందర్ రెడ్డి ఘన విజయం సాధించారు. ఈ ఫలితంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనగా, ఆయనకు మద్దతుదారులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం మాచన్న గారి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ..తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి గ్రామస్తుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పరిశుభ్రత, పచ్చదనం, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించే విధంగా పనిచేస్తానని మాచనగారి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధిగా పారదర్శక పాలన అందిస్తూ, అన్ని వర్గాలను కలుపుకొని మహాలింగాపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఏమిటీ కాలుష్యం

- ఢిల్లీ నగరం నరకంలా మారుతోంది
- సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- టోల్ ప్లాజాలు మూసేయాలంటూ ఆదేశం
- నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచన
- శాశ్వత పరిష్కారాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశం



దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి శీతాకాలంలో తీవ్రస్థాయికి చేరుకుంటున్న వాయు కాలుష్య సమస్యపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డిసెంబర్ 17, 2025న జరిగిన విచారణలో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ సంక్షోభాన్ని "వార్షిక లక్షణం" annual featureగా అభివర్ణించింది. ప్రస్తుత చర్యలు "పూర్తి వైఫల్యం" అని విమర్శించిన కోర్టు, దీర్ఘకాలిక, ఆచరణాత్మక పరిష్కారాల అవసరాన్ని బలంగా నొక్కి చెప్పింది.

**కాలుష్యానికి ప్రధాన కారకం**

కోర్టు విచారణలో ఢిల్లీ సరిహద్దుల్లోని టోల్ ప్లాజాల వద్ద ఏర్పడే భారీ ట్రాఫిక్ జామ్‌లు వాహనాల నుంచి విడుదలయ్యే ఉద్గారాలను పెంచి కాలుష్యాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని గుర్తించింది. ముఖ్యంగా ఢిల్లీగురుగ్రామ్ సరిహద్దులోని మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ నిర్వహిస్తున్న టోల్ ప్లాజా వద్ద గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడం ద్వారా కాలుష్యం పెరుగుతోందని పేర్కొంది.

**ఈ నేపథ్యంలో:**

ఢిల్లీలోకి ప్రవేశించే 9 టోల్ ప్లాజాలను తాత్కాలికంగా మూసివేయడం లేదా మార్చడం పరిశీలించాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) మరియు MCDకు ఆదేశించింది.

MCD ఈ విషయంలో NHAIతో సహకరించి, ఒక వారంలోపు నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. టోల్ ప్లాజాలను ప్రస్తుత 510 కిలోమీటర్ల దూరం నుంచి కనీసం 50 కిలోమీటర్ల దూరానికి మార్చాలని సూచించింది. ఇలా చేస్తే ట్రాఫిక్‌ను డైవర్ట్ చేసి నగర సరిహద్దుల్లో రద్దీ, కాలుష్యం తగ్గుతాయని CJI అభిప్రాయపడ్డారు. తాత్కాలిక మూసివేత వల్ల MCDకు ఆదాయ నష్టం జరిగితే, కొత్త టోల్ పాయింట్ల నుంచి వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని MCDకు బదిలీ చేయవచ్చని కోర్టు సూచించింది.

"జనవరి 31 వరకు టోల్‌లు లేకుండా చేయడం ఎందుకు సాధ్యం కాదు?" అని CJI ప్రశ్నించారు. ఆరోగ్యం కంటే ఆదాయం ముఖ్యం కాదని స్పష్టం చేశారు.

ఈ చర్యలతో శీతాకాల పీక్ నెలల్లో (అక్టోబర్ 1 నుంచి జనవరి 31 వరకు) టోల్ సేకరణను నిలిపివేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని కోర్టు భావిస్తోంది.

**దీర్ఘకాలిక చర్యలపై దృష్టి**

కోర్టు కేవలం తాత్కాలిక చర్యలు (GRAP దశలు) సరిపోవని, శాశ్వత పరిష్కారాలు అవసరమని నొక్కి చెప్పింది. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (CAQM)ను దీర్ఘకాలిక ప్రణాళికను పునఃసమీక్షించి, దశలవారీగా అమలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ అంశాలపై దృష్టి పెట్టాలని సూచించింది: పరిశ్రమలు, ఇంధన వనరులను శుభ్రంగా మార్చడం. రైతులకు పంట వ్యర్థాలు దహనం మానేయాలని ప్రోత్సాహకాలు. పట్టణ రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం. పచ్చదనం పెంచడం, పౌర అవగాహన కార్యక్రమాలు. ఇతర మూలాల నుంచి కాలుష్య నియంత్రణ. కాలుష్యానికి ఏకైక కారణం లేదని, నిపుణుల సలహాలతోనే శాశ్వత పరిష్కారాలు సాధ్యమని కోర్టు అభిప్రాయపడింది.

**ఇతర కీలక ఆదేశాలు**

నర్సరీ నుంచి క్లాస్ 5 వరకు పాఠశాలల మూసివేత ఆదేశాన్ని మార్చడం అవసరం లేదని తేల్చింది (వింటర్ బ్రేక్ సమీపిస్తోంది కాబట్టి).

నిర్మాణ ఆంక్షల వల్ల నిరుద్యోగులైన కార్మికులకు పరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఢిల్లీ ప్రభుత్వానికి ఆదేశించింది.

ఢిల్లీలో ప్రస్తుతం AQI 'సీవియర్' స్థాయిలో ఉండటంతో, ఈ ఆదేశాలు తక్షణ ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికారులు ఈ సూచనలను త్వరగా అమలు చేస్తే కాలుష్యం కొంతమేర తగ్గే అవకాశం ఉంది. కోర్టు ఈ విషయంపై నిరంతరం పర్యవేక్షణ చేస్తోంది.

# భారత్ ట్యాక్సీ గేమ్ చేంజర్

- ఓలా, ఉబర్, ర్యాపిడోలకు గట్టి పోటీ
- జనవరి 1 నుంచి ఢిల్లీలో ప్రారంభం
- వినియోగదారులకు తక్కువ ధరకే ప్రయాణం
- కస్టమర్లు చెల్లించిన మొత్తంలో 99 శాతం డ్రైవర్లకే
- లాభాల్లో డ్రైవర్లకు వాటాలు..
- కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**




దేశంలో తొలిసారిగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సహకార (కోఆపరేటివ్) మోడల్‌పై ఆధారిత రైడ్‌హెయిలింగ్ సేవలు ప్రారంభమవుతున్నాయి. 'భారత్ ట్యాక్సీ' పేరుతో వస్తున్న ఈ యాప్ ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేటు కంపెనీలకు గట్టి పోటీ ఇవ్వనుంది. డిసెంబర్ 17, 2025 నాటి తాజా ప్రకటన ప్రకారం, ఈ సేవలు 2026 జనవరి 1 నుంచి దేశ రాజధాని ఢిల్లీలో అధికారికంగా అందుబాటులోకి రానున్నాయి. ఆ తర్వాత క్రమంగా దేశ వ్యాప్తంగా విస్తరణ జరుగుతుంది.

**నేపథ్యం, లక్ష్యాలు**

ప్రైవేటు క్యాబ్ అగ్రిగేటర్లు అధిక కమీషన్లు వసూలు చేయడం, సర్జ్ ప్రైసింగ్ (పీక్ అవర్స్‌లో ధరలు భారీగా పెంచడం), అస్పష్టమైన ధరలు, డ్రైవర్లకు తక్కువ ఆదాయం వంటి సమస్యలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 'సహకార్ సే సమృద్ధి' లక్ష్యంతో భారత్ ట్యాక్సీని తీసుకొచ్చింది. ఇది డ్రైవర్లకు యజమాన్య హక్కు కల్పించి, ప్రయాణికులకు స్థిరమైన, పారదర్శకమైన ధరలతో సేవలు అందించే లక్ష్యంతో రూపొందించబడింది. ఈ యాప్‌ను సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ నిర్వహిస్తుంది. ఇది మల్టీస్టేట్ కోఆపరేటివ్ సొసైటీగా జూన్ 2025లో రిజిస్టర్ అయింది. ప్రముఖ సహకార సంస్థలైన అమూల్, ఇఫ్కో, క్రిబ్కో, నాఫెడ్ (NAFED), ఎన్‌సీడీసీ (NCDC), నాబార్డ్ (NABARD) వంటివి ఈ సంస్థకు మద్దతు ఇస్తున్నాయి. బోర్డులో డ్రైవర్ ప్రతినిధులు కూడా ఉంటారు.

తొలుత ఢిల్లీలో 2026 జనవరి 1 నుంచి ఢిల్లీలో అధికారిక లాంచ్. ఇప్పటికే బీటా ట్రయల్స్ ప్రారంభమయ్యాయి. సుమారు 56 వేల మంది డ్రైవర్లు (ముఖ్యంగా ఢిల్లీ మరియు గుజరాత్‌లో) ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద డ్రైవర్‌ఓన్డ్ మొబిలిటీ ప్లాట్‌ఫాం అవుతుంది. ఢిల్లీ తర్వాత గుజరాత్ (రాజ్‌కోట్), ఆ తర్వాత ఇతర మెట్రో నగరాలు. 2026 మార్చి నాటికి పలు మెట్రోలు, 2030 నాటికి లక్ష మంది డ్రైవర్లు, గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరణ లక్ష్యం.

**సేవలు, ఫీచర్లు**

అందుబాటులో ఉండే సేవలు (క్యాబ్), ఆటోలు, బైక్ ట్యాక్సీలు.యాప్ అందుబాటు ఆండ్రాయిడ్ (గూగుల్ ప్లే స్టోర్‌లో ఇప్పటికే అందుబాటు), iOS వెర్షన్ త్వరలో. మొబైల్ నంబర్‌తో సులభంగా రిజిస్ట్రేషన్.

**ప్రత్యేకతలు ఇవే..**

సర్జ్ ప్రైసింగ్ లేదు - స్థిరమైన, పారదర్శక ధరలు. మల్టీలింగ్వల్ ఇంటర్‌ఫేస్, 24/7 కస్టమర్ సపోర్ట్.

భద్రత: ఢిల్లీ పోలీసులతో టైఅప్, వెరిఫైడ్ డ్రైవర్లు.

**డ్రైవర్లకు ప్రయోజనాలు**

కమీషన్ లేదు ప్రైవేటు యాప్‌లు 2040% కమీషన్ తీసుకుంటే, భారత్ ట్యాక్సీలో రైడ్ ఆదాయంలో 80% కంటే ఎక్కువ (కొన్ని నివేదికల ప్రకారం 100%) డ్రైవర్లకే. సభ్యత్వ మోడల్**: అతి తక్కువ నామినల్ ఫీజు (డైలీ/వీక్లీ/మంత్లీ) మాత్రమే చెల్లించాలి. యజమాన్య హక్కు డ్రైవర్లు సభ్యులు, షేర్‌హోల్డర్లు అవుతారు. లాభాలు వారికే పంచుతారు.

**ప్రయాణికులకు ప్రయోజనాలు**

అధిక ధరల నుంచి ఉపశమనం.

పారదర్శకత, భద్రత, నమ్మకమైన సేవలు.

ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండటం వల్ల నాణ్యత హామీ. ఈ చొరవ ప్రైవేటు కంపెనీల గుత్తాధిపత్యాన్ని ఛాలెంజ్ చేస్తూ, డ్రైవర్ల సంక్షేమం మరియు ప్రయాణికుల సౌకర్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఢిల్లీలో విజయవంతమైతే, దేశవ్యాప్తంగా రవాణా రంగంలో గణనీయ మార్పు రావచ్చు. యాప్ అందరూ డౌన్ లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి.



# విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

- ఎంఈఓ గజ్జెల కనకరాజు

**దౌల్తాబాద్ డిసెంబర్ 17(ప్రజాస్వరం) :**

దౌల్తాబాద్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుప్రియాల్‌ను మండల విద్యాధికారి (ఎంఈఓ) గజ్జెల కనకరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదవ తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని విద్యార్థులు ఇప్పటినుంచే ఒక స్పష్టమైన ప్రణాళికతో వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. మనకున్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ రోజువారీ చదువుకు క్రమశిక్షణతో ప్రణాళిక రూపొందించుకుని కష్టపడి చదవాలని విద్యార్థులకు హితవు పలికారు. అలాగే ఉదయకాలంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో చరవాణి ద్వారా మాట్లాడి పిల్లలను సమయానికి మేల్కొలిపి చదువుకు, పరీక్షలకు సిద్ధపరచాలని సూచించారు. ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింలు, రాజయ్య, సుధాకర్, మహిపాల్, సిఆర్పి కుమార్ పాల్గొన్నారు.









# విజయోత్సవ ర్యాలీలు నిషేధం

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా
- పోలింగ్ కేంద్రాల పరిశీలన

**వికారాబాద్, డిసెంబర్ 17 (ప్రజా స్వరం) :**

జిల్లాలో పేస్ 3, పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్ గ్రామమైన సయ్యద్ పల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పేస్-3 ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు, ఇతర వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నంతకాలం ఈ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని, నిబంధనలను అతిక్రమించిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు, నాయకులు మరియు అభ్యర్థులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# జవహర్‌నగర్ డివిజన్‌ల సంఖ్యను పెంచండి



- సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు బీసీ జేఏసీ నాయకుల వినతి

**జవహర్ నగర్, డిసెంబర్ 17, ప్రజాస్వరం :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేసిన జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలని జవహర్ నగర్ బిసి సంఘం నాయకులు అన్నారు. బుధవారం జవహర్ నగర్ బిసి జేఏసీ ఆధ్వర్యంలో జవహర్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంతను కలిసి నాలుగు డివిజన్ గా ఏర్పాటు చేసి బీసీలకు స్థానాలను కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం బీసీ జేఏసీ అధ్యక్షుడు మారోజు సోమాచారి మాట్లాడుతూ... అగ్రకులాల కుట్రలో భాగంగానే విస్తీర్ణంలోనూ జనాభాలో ను ఎక్కువగా ఉండే జవహర్ నగర్ నూ కేవలం రెండు డివిజన్ లూగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రెండు డివిజన్ లనూ నాలుగు డివిజన్లకు పెంచాలని , ఇప్పుడు నివసిస్తున్న ఉన్న జనాభాను పరిగణలోకి తీసుకొని జనాభా ప్రాతిపదికన కార్పొరేట్ సీట్లను బీసీలకకేటాయించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, లలితయాదవ్,బిసి జేఏసీసలహాదారులు కారింగుల రాజు,కొండల్ ముదిరాజ్ , రంగుల శంకర్,కోటేష్‌గౌడ్ బీఆర్ఎస్ నాయకుడు బండ కింది ప్రసాద్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నరసింహ ,బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి శనిగరం నరసింహ, కోశాధికారి రేగోటి సురేష్,శివాజీ నగర్ పద్మశాలి అధ్యక్షులు సత్యనారాయణ, బీసీ జేఏసీ కార్యదర్శి ఆంజనేయులు చారి,బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

- ముద్దాపూర్ గ్రామ సర్పంచ్‌గా తూం శ్రీకాంత్

**గజ్వేల్ డిసెంబర్ 17 ప్రజాస్వరం :**



సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం ముద్దపూర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో తూం శ్రీకాంత్, సమీప ప్రత్యర్థి గొడుగు కిషన్ పై 239 ఓట్ల మెజార్టీతో సర్పంచ్ గా గెలుపొందారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, తనను నమ్మి అఖండ మెజార్టీతో గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి కష్టసుఖాల్లో తోడుంటానని, గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, తల్లిదండ్రుల ఆశయాలను కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.

# పంచాయతీ ఎన్నికల్లో సంధ్య గెలుపు

**మాసాయిపేట డిసెంబర్ 18 (ప్రజాస్వరం)**



మండలం రామంతపూర్ పంచాయతీ ఎన్నికల్లో సంధ్యా రఘు విజయం సాధించారు. ప్రత్యర్థి అనితపై 532 ఓట్ల భారీ మెజారిటీతో విజేతగా నిలిచారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. గతంలో ఓటమి పాలైనా అధైర్యపడకుండా ప్రజా సేవలో కొనసాగానని, నేడు గ్రామ ప్రజలు దీవించి గెలిపించడం సంతోషంగా సంధ్య ఉందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఊరి అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని స్పష్టం చేశారు

# వికారాబాద్ జిల్లాలో 84 శాతం పోలింగ్

## పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, డిసెంబర్ 17(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో బుధవారం మూడవ విడత ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 84 శాతం ఓట్లు పోలైనాయి. పరిగి నియోజకవర్గంలో పరిగి, పూడూరు, కులకచర్ల, దోమ, చౌడాపూర్ మండలాల్లో పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. మూడవ విడత 5 మండలాలకు సంబందించి 157 గ్రామా పంచాయతీలకు గాను 17 గ్రామా పంచాయతీలు ఏకగ్రీవం కాగ , మిగతా 140 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు,, వార్డ్స్ 1340 లకు గాను 138 వార్డ్స్ ఏకగ్రీవం అయ్యాయి, 1202 వార్డ్స్ కు ఎన్నికలు నిర్వహించారు.ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులకు ప్రిసైడింగ్ అధికారులు 1470, ఓ.పీ.ఓ లు 1726 , టూ మెంబర్ టీం 988, త్రి మెంబర్ టీం 214, లను మొత్తం 1202 సిబ్బంది ని కేటాయించారు. కాగా పూడూర్ మండలం మన్నేగూడ, పూడూర్ గ్రామాలలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. వెబ్ క్యాస్టింగ్ ద్వారా మూడవ విడత కౌంటింగ్ ప్రాసెస్ ను జనరల్ అబ్సర్వర్ షేక్ యాస్మిన్ బాష, జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో ట్రైనీ కలెక్టర్ హర్స్ చౌదరి, నోడల్ అధికారులు ఉన్నారు.








# అమోఘ్ గ్రాండ్ రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు

**రామాయంపేట, ప్రజాస్వరం :**

మెదక్ జిల్లా రామయంపేట పట్టణంలో ఆహార భద్రత అధికారి స్వదీప్ కుమార్ హోటళ్లు, రెస్టారెంట్ల పై,చర్యలు తీసుకుని, ఆహార భద్రత ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యయంగా విస్తృత తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని మెదక్ జిల్లా ఆహార భద్రత నియంత్రణ అధికారి స్వదీప్ కుమార్ తెలిపారు.బుధవారం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని అమోఘ్ గ్రాండ్ రెస్టారెంట్ లో ఆహార భద్రతా అధికారి విస్తృత తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీలో గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులు దుకాణంలో బూజు బట్టిన ఉన్న పాపడ్‌లు కనిపించాయి, స్టోర్ రూమ్‌లో దొరికిన గడువు ముగిసిన షెజ్వాన్ సాస్ బాటిళ్లను రెస్టారెంట్‌లోని చైనీస్ వంటగదిలో ఉపయోగిస్తున్నారు. ఈ వస్తువులను ధ్వంసం చేశారు. ఇతర ఉల్లంఘనలను గుర్తించి నోటీసు జారీ చేశారు, జరిమానా విధించడానికి కేసు నమోదు చేయడానికి పంచమామ చేశారు.ఈ సందర్భంగా ఆహార భద్రత తనిఖీ అధికారి స్వదీప్. కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హోటల్ లో రెస్టారెంట్లు యాజమాన్యాలపై ఫుడ్‌సేఫ్టీ ఉక్కుపాదం మోపుతున్నదని అన్నారు. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్‌క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.ఈ తనిఖీలలో ఫుడ్ శాంపిల్స్ అసిస్టెంట్ నజీర్, సిబ్బంది, అరవింద్ పాల్గొన్నారు.



# వృద్ధుడికి ఆర్ఎస్ఐ సహాయం

**మెదక్, డిసెంబర్ 17 (ప్రజా స్వరం) :**

జిల్లా లో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా లో పలు చోట్ల ఎన్నికల్లో ఓటు హక్కు వస్తున్న వృద్ధులకు, వికలాంగులకు సహాయం చేస్తున్న సందర్భాలు మనం ఈ మధ్య కాలంలో చూస్తున్నాం.. ఇదే క్రమంలో బుధవారం ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు సహాయం చేసిన సంఘటన నర్సాపూర్ మండలం లో చోటు చేసుకుంది. మండల పరిధిలో అహ్మద్ నగర్ గ్రామంలో నడవలేని స్థితిలో వస్తున్న వృద్ధుని ఆర్ఎస్ఐ నరేష్ గమనించారు. ఈ సందర్భంగా ఆ వృద్ధుడిని వీల్ చైర్ పై తీసుకువెళ్లి పోలింగ్ కేంద్రానికి చేర్చి, అతడిని ఓటు హక్కు వినియోగించుకునేలా సహాయం చేశాడు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు సహాయం చేయడం పలువురు ప్రశంసలు వెలువడుతున్నాయి.





# జాతీయ స్థాయి శిక్షణా తరగతుల్లో నార్సింగి ఉపాధ్యాయులు రామకృష్ణ

**నార్సింగి, డిసెంబర్ 17 (ప్రజా స్వరం) :**

కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ లోని ఉదయపూర్ లో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి శిక్షణా తరగతులలో నార్సింగి లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రామకృష్ణ విజయ వంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ జాతీయ స్థాయి శిక్షణకు తెలంగాణ రాష్ట్రం నుంచి రామకృష్ణతో పాటు మరో ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఎంపికై శిక్షణ పొందడం విశేషం. జాతీయ నూతన విద్యా విధానం2020 అమలులో భాగంగా, విద్యార్థులకు క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా చెప్పే "సరళీకృత బోధనా పద్ధతుల" పై ఈ శిక్షణా కార్యక్రమంలో తర్ఫీదు ఇచ్చారు. నవంబర్ 26 నుంచి మొదలైన శిక్షణా కార్యక్రమం సుదీర్ఘంగా 21 రోజుల పాటు జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నేర్చుకున్న మెలకువలు, బోధన నైపుణ్యాలను త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు వివరిస్తామని, తద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. రామకృష్ణ అరుదైన అవకాశాన్ని అందుకోవడం పట్ల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు, బోధనా బోధనేతర సిబ్బంది, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.



# తాండా సర్పంచ్‌గా చందర్ గెలుపు

**మాసాయిపేట, డిసెంబర్ 18 (ప్రజాస్వరం) :**

రామంతపూర్ తాండాలో చందర్ జయభేరి మాసాయిపేట మండలం రామంతపూర్ తాండా పంచాయతీ ఎన్నికల్లో కేతావత్ చందర్ విజయం సాధించారు. ప్రత్యర్థి బన్సీపై 166 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ముగిసిన తర్వాత తామంతా ఒకే కుటుంబమని ఆయన అన్నారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ అందరిని కలుపుకొని ముందుకెళ్తానని హామీ ఇచ్చారు. తన గెలుపు కోసం సహకరించిన తాండా వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.



# పంచాయతీ ఎన్నికల్లో మాధవరెడ్డి విజయం

**మాసాయిపేట డిసెంబర్ 18 (ప్రజాస్వరం) :**

పోతిన్పల్లి పంచాయతీలో మాధవరెడ్డి విజయకేతనం ఎగురవేశారు. సమీప ప్రత్యర్థి నాగరాజు పై 219 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. విజయం ఖరారు కావడంతో ఊరిలో మద్దతుదారుల కోలాహలం నెలకొంది. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆకాంక్షించారు. మౌలిక వసతుల కల్పనే తన తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు.



# ఓటు హక్కు వినియోగించుకున్న ఆవుల రాజిరెడ్డి



**మాసాయిపేట, డిసెంబర్ 17 (ప్రజాస్వరం) :**

పంచాయతీ ఎన్నికల సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి తమ స్వగ్రామమైన మాసాయిపేట గ్రామంలో కుటుంబ సమేతంగా ఓటు హక్కును విని యోగించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ప్రతి ఓటరు తన హక్కును బాధ్యతగా వినియో గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల చైతన్యంతోనే ప్రజాస్వామ్యం మరింత బలపడు తుందని ఆయన పేర్కొన్నారు.

# గుండె పోటుతో సర్పంచ్ అభ్యర్థి సంజీవరెడ్డి మృతి

- **నివాళులర్పించిన పద్మా దేవేందర్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి**

**రామాయంపేట, ప్రజా సర్వం :**

మెదక్ జిల్లా శంకరంపేట ఆర్ మండలం జంగరాయి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి రాజన్నగారి. సంజీవరెడ్డి గుండెపోటు రావడంతో అస్పత్రిలో చేర్చగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మా దేవేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి బుధవారం జంగారాయి గ్రామానికి చేరుకొని సంజీవరెడ్డి భౌతికఖాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం అంతక్రియల్లో పాల్గొన్నారు. వీరి వెంట పిఎసిఎస్ చైర్మన్ అంజి రెడ్డి, మాజీ జడ్పిటిసి మాధవి రాజు, మాజీ సర్పంచులు కుమార్ గౌడ్, మంచాల. లక్ష్మణ్, దయానంద్ యాదవ్,అయ్యోరి లక్ష్మణ్ మహిపాల్ రెడ్డి జ్యోతి ప్రభాకర్ లింగారెడ్డి, మండల్ నాయకులు రామ్ రెడ్డి మైపాల్ రెడ్డి బాగా రెడ్డి బందెల సుధాకర్ ఇమ్మడి నరేష్ తదితరులు ఉన్నారు.



# తొలి సర్పంచ్ ఆ జ్ఞాపకాలు మధురం



**మాసాయిపేట, డిసెంబర్ 17 ( ప్రజాస్వరం) :**

1965లో మాసాయిపేట గ్రామ మొట్టమొదటి సర్పంచ్ గా పనిచేసిన అనుభవం ఎంతో గొప్పదని మాజీ ఎమ్మెల్యే విఠలెడ్డి గుర్తుచేసుకున్నారు. నేడు ఓటు వేసిన ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో 11 వార్డులతో ఉన్న మాసాయిపేట నేడు 6 పంచాయతీలుగా విడిపోయిందని తెలిపారు. ఆ కాలంలో ఎన్నికల ఖర్చు కేవలం రూ. 1200 మాత్రమేనని, ఆ తర్వాతే తాను ఎమ్మెల్యేగా పోటీ చేశానని వివరించారు. గ్రామాభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించినందుకు సంతోషంగా ఉందన్నారు.

# రొమ్ము క్యాన్సర్ మహిళలకు ఆపరేషన్లు

**సోనూసూద్ మరో బృహత్తర కార్యక్రమం**



ఇప్పటికే ఎంతోమందికి సాయం చేసి సోనూసూద్ రియల్ లైఫ్ హీరో అనిపించుకున్నారు. ఆపదలో, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తున్నారు. తాజాగా మరోసారి ఆయన తన మంచి మనసును చాటుకున్నారు. తన ఫౌండేషన్ ద్వారా దేశంలో ఉన్న 500 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ చికిత్స చేయించినట్లు వెల్లడిరచారు. దేశంలోని మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంపై మరింత దృష్టిసారించినట్లు తెలిపారు. మొత్తం 500కి పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. 500 మంది మహిళలను మేం కాపాడగలిగాం. వారంతా కొత్త జీవితాన్ని పొందారు. వారి కుటుంబాల్లో ఆనందం నింపినందుకు నేనెంతో సంతోషంగా ఉన్నాను. సమష్టి కృషి ద్వారా మాత్రమే ఇలాంటి గొప్ప పనులు జరుగుతాయని సోనూసూద్ తెలిపారు. వైద్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఇది ప్రారంభం మాత్రమేనని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో తానెప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. సోనూసూద్ గొప్ప మనసు చాటుకోవడం ఇదే తొలిసారి కాదు. కరోనా సమయం నుంచి ఆయన తరచూ ఇలాంటి పనులు చేస్తూనే ఉన్నారు. సినిమాల్లో విలన్ పాత్రల్లో నటించిన ఆయన లాక్‌డౌన్ కాలంలో వలస కూలీలను తన సొంత ఖర్చులతో సొంతూళ్లకు పంపించడం ద్వారా రియల్ హీరోగా జనం హృదయాల్లో చోటు దక్కించుకున్నారు. ఆ తర్వాత నుంచి సోషల్ మీడియా వేదికగా తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ వారికి సాయం చేస్తున్నారు.

# మరో హిందీ మూవీలో తమన్నా

తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బ్జడెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.



# ఇది చూశాక నాకు మాటలు రావడం లేదు..

బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన 'ధురంధర్' మూవీ బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టిస్తోంది. అంతేకాకుండా కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమా సినీ ప్రముఖల చేత ప్రశంసలు పొందుతోంది. ఇప్పటికే ఐకాన్ స్టార్ వంటి స్టార్స్ 'ధురంధర్'ని ఆకాశానికెత్తేశారు. తాజాగా, సూపర్ స్టార్‌తో నటించిన ఫుల్ పాపులారిటీ తెచ్చుకున్న ప్రీతీ జింటా ట్విట్టర్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'ధురంధర్' చూసిన ఆమె భావోద్వేగానికి గురైంది. ''ఈ రోజు చాలా సరదాగా గడిచింది. చాలా కాలం తర్వాత నేను ఒక్కదాన్ని థియేటర్‌లో సినిమా చూశాను. మధ్యాహ్నం షో హౌస్‌ఫుల్ అయింది. వావ్, అదొక అద్భుతమైన అనుభవం.

చాలా కాలంగా నేను చూసిన ఉత్తమ చిత్రాలలో ఇది ఒకటి. సహజంగా, వాస్తవికంగా ఉంది. హృదయాన్ని హత్తుకునే, ఉత్కంఠభరితమైన సంగీతం చాలా నచ్చింది. అన్నింటికన్నా ఎక్కువగా ఆదిత్య ధర్ దర్శకత్వం చాలా నచ్చింది. చాలా కష్టమైన పని.. అయినా కూడా ఎంతో హృదయంతో చేశారు. ఇది కేవలం ఒక సినిమా కాదు. మన దేశాన్ని రక్షించడానికి ప్రమాదంలో నిలబడిన ప్రతి అజ్ఞాత పురుషుడు, మహిళ, దేశభక్తుడికి ఇది ఒక ప్రేమలేఖలాంటిది. మూడున్నర గంటలు కనురెప్ప పాటులో గడిచిపోయాయి. దీన్ని మళ్ళీ చూడటానికి సిద్ధంగా ఉన్నాను. ఆదిత్య ధర్ నాకు మాటలు రావడం లేదు. మాటలు వచ్చినప్పుడు నేను మీకు ఫోన్ చేసి, నాకెలా అనిపించిందో, ఈ కళాఖండాన్ని నేను ఎంతగా ప్రేమించానో చెబుతాను. అప్పటి వరకు నేను చెప్పేదొక్కటే, దీన్ని అస్సలు మిస్ అవ్వకండి మిత్రులారా థియేటర్స్‌కి వెళ్లి 'ధురంధర్' చూడండి .ఈ కళాఖండాన్ని సజీవంగా తీసుకువచ్చిన నటీనటులు, సాంకేతిక నిపుణుల బృందానికి పెద్ద అభినందనలు'' అని రాసుకొచ్చింది.



# ఓటిటిలో ఆకట్టుకుంటున్న కాంత

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం కాంత . సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 14న విడుదలైంది. తమిళంలో కాంత చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించడంలో విఫలమైంది. తెలుగులో మాత్రం ఈ చిత్రాన్ని బోరింగ్‌గా ఫీలయ్యారు. ఈ మూవీ ఓటీటీలో మంచి రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో పలు ప్రధాన భాషల్లో విడుదలైంది కాంత. తాజా అప్‌డేట్ ప్రకారం కాంత చిత్రానికి ఓపెనింగ్ వీకెండ్‌లో 1.1 మిలియన్ వ్యూస్‌తో అద్భుతమైన స్పందన వచ్చింది. ఓటీటీలో విడుదలైన ఫస్ట్ వీకెండ్‌లో 1 మిలియన్ వ్యూస్ అధిగమించిన 17వ కోలీవుడ్ సినిమాగా కూడా నిలిచింది కాంత. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. సముద్రఖని, రానా కీలక పాత్రల్లో నటించారు. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు.




# దర్శకులకి ఎక్కువ కనిపించలేదేమో నేను!

''అన్ని రకాల భావోద్వేగాలున్న చిత్రం 'దండోరా'. చాలా సహజంగా ఉంటూనే చక్కటి స్క్రీన్‌ప్లేతో ఆద్యంతం ఆసక్తి రేకెత్తిస్తూ సాగుతుంది'' అన్నారు నటుడు శివాజీ. ఆయన.. నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని మురళీకాంత్ తెరకెక్కించారు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు శివాజీ. ''కోర్ట్' కన్నా ముందే 'దండోరా' కథ విన్నా. ఇదేమీ సందేశాత్మక చిత్రం కాదు. అన్ని రకాల వాణిజ్యాంశాలతో ఆద్యంతం అలరించేలా ఉంటుంది. దీంట్లో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. నేను మంచోణ్నా.. చెడ్డోడినా అనేది చూసే ప్రేక్షకులకు సరిగా అర్థం కాదు. సినిమా చూశాక నా గురించి వాళ్లేం అనుకుంటారో వినాలని ఉంది. దీంట్లో నాకు ఎన్నో రకాల భావోద్వేగాల్ని చూపించే పాత్ర దొరికింది. ఎంతో అదృష్టం ఉంటే తప్ప ఇలాంటి పాత్రలు రావు. 'కోర్ట్'లో మంగపతి పాత్రకు ఎంతటి ఆదరణ దక్కిందో 'దండోరా'లో పోషించిన పాత్రకూ అంతే పేరొస్తుంది''. ''మన దర్శకులు ఎక్కువ లెక్కలేసుకుంటుంటారు. మన దగ్గర ఎంతో ప్రతిభావంతులైన యాక్టర్స్ ఉన్నా పక్క భాషల నుంచి తీసుకొస్తుంటారు. ఈ సినిమాలో నవదీప్, నందు, రవికృష్ణ అందరూ అద్భుతమైన ఆర్టిస్టులే. కానీ, ఇక్కడ వాళ్ల గురించి మనమే తక్కువ అంచనా వేసుకుంటాం. ఇదే శివాజీ 30ఏళ్ల నుంచి ఇక్కడే ఉన్నాడు. నేనిది వరకు ఎన్నో ప్రతినాయక పాత్రలు పోషించాను. కానీ, మన దర్శకులకు నేనెక్కువ కనిపించలేదేమో. ప్రస్తుతం నేను దాదాపు కొత్త దర్శకులతోనే పని చేస్తున్నాను''.



# బాలయ్య-బోయపాటి శ్రీను కాంబోలో మరో సినిమా ?

నందమూరి బాలయ్య తాజాగా చేసిన అఖండ 2 సినిమా థియేటర్ లలో ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా ఇప్పటికే రూ.100 కోట్లు దాటినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. బాలయ్యబోయపాటి శ్రీను కాంబినేషన్ వచ్చిన ఈ మూవీ నార్త్ లో కూడా బాగా నడుస్తోందట. హిందూ ధర్మం, శివుడి చుట్టూ సినిమా కథ ఉండటంతో జనాలు ఎగబడి చూస్తున్నారని టాక్. అయితే, అఖండ 2 సినిమా సక్సెస్ అయిన తరుణంలో బాలయ్యబోయపాటి శ్రీను కాంబినేషన్ మరో సినిమా కూడా పట్టేలెక్కనున్నట్లు ఓ న్యూస్ చెక్కర్లు కొడుతోంది. గీతా ఆర్ట్స్ బ్యానర్ లో ఈ సినిమా రానుందట. ఇప్పటికే బాలయ్యబోయపాటి శ్రీను కాంబినేషన్ 4 సినిమాలు వచ్చి, సక్సెస్ అయ్యాయి. ఇక ఇప్పుడు 5వ సినిమా రాబోతుందట. త్వరలోనే విజయ్ దేవరకొండతో బోయపాటి శ్రీను సినిమా చేయనున్నారట. ఆ మూవీ ఫినిష్ కాగానే, బాలయ్య ప్రాజెక్ట్ ప్రారంభం కానుందట. 2027 వరకు ఈ మూవీ పట్టాలెక్కనుందని టాక్ నడుస్తోంది. దీంతో బాలయ్య ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. కాగా బాలయ్యబోయపాటి శ్రీను కాంబినేషన్ లో సింహా, లెజెండ్, అఖండ, అఖండ 2 సినిమాలు వచ్చాయి.




# వారణాసి సెట్స్‌కు వస్తా




'వారణాసి' మూవీ సెట్‌కు వచ్చి షూటింగ్ చూడవచ్చా? అని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మన తెలుగు దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళిని కోరారు. కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన విజువల్ వండర్ 'అవతార్'. ఇప్పటికే రెండు భాగాలు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు ముచ్చటగా మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'అవతార్' టీమ్ భారత్‌లో వినూత్నంగా ప్రచారానికి తెర తీసింది. దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సహా కొంత మంది సినీ ప్రముఖులకు 'అవతార్ 3'ని చూపించారు. అనంతరం జేమ్స్ కామెరూన్, రాజమౌళి వీడియో కాల్ ద్వారా మాట్లాడుకున్నారు. సినిమా మేకింగ్, పాత్రల తీరు తెన్నుల గురించి ఒకరితోనొకరు చర్చించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా 'వారణాసి' మూవీ ప్రస్తుత పరిస్థితి గురించి రాజమౌళిని కామెరూన్ అడిగి తెలుసుకున్నారు. ఏడాదిగా షూటింగ్ జరుగుతోందని, మరో ఏడెనిమిది నెలల పాటు షూటింగ్ ఉందని రాజమౌళి వివరించారు. 'వారణాసి' షూటింగ్, సెట్స్ చూడాలని ఉందన్న కామెరూన్.. 'వచ్చి చూడవచ్చా' అని అడిగారు. ఈ మాటతో రాజమౌళి తెగ సంబరపడిపోయారు. 'మీరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం. మా 'వారణాసి' టీమ్ మాత్రమే కాదు. మొత్తం సినిమా ఇండస్ట్రీ థ్రిల్ అవుతుంది' అని రాజమౌళి అనగా, 'పులులతో ఏదైనా షూట్ ప్లాన్ చేస్తుంటే చెప్పు' అని కామెరూన్ సరదాగా అనడంతో నవ్వులు వెల్లివిరిశాయి. సెకండ్ యూనిట్‌కైనా కెమెరా పట్టుకుని తాను కొన్ని సీన్స్ తీస్తానని కామెరూన్ చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ.. 'అందరి కంటే ముందు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చూడటం నిజంగా ఎంతో సంతోషంగా ఉంది. మూవీలో సీక్వెన్స్, విజువల్స్, పాత్రలు తీర్చిదిద్దిన విధానానికి హ్యాట్సాఫ్. మూవీ చూస్తున్నప్పుడు థియేటర్‌లో చిన్న పిల్లాడిలా అయిపోయాను. బయటకు వచ్చాక కూడా అవే ఆలోచనలు వెంటాడాయి. ముఖ్యంగా కథానాయకుడు జేక్ నైతికంగా డైలమాలో పడే సన్నివేశాలు, అతడు తీసుకునే నిర్ణయాలు ఇందులో మరింత అద్భుతంగా చూపించారు. ఇంతకు మించి ఎక్కువ మాట్లాడితే స్పాయిలర్ అవుతుంది. అవతార్ ఫ్రాంఛైజీ వెండితెరకు ఒక బెంచ్ మార్క్ అని కొనియాడారు.

# బాస్టియన్ రెస్టారెంట్‌పై కేసు





**హైకోర్టును ఆశ్రయించిన నటి శిల్పాశెట్టి**

బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. అయితే రెస్టారెంట్‌పై కేసు నమోదు చేయడంపై శిల్పశెట్టి తీవ్రంగా స్పందించింది. ఈ రెస్టారెంట్‌పై వచ్చిన వార్తలను శిల్పా శెట్టి ఖండిస్తూ.. బుధవారం సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.తమపై తమ రెస్టారెంట్‌పై వస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమైనవని. కొందరూ కావాలనే తమ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఈ వివాదానికి క్రిమినల్ రంగు పూస్తున్నారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఇప్పటికే తాము హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశాము. ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున మీడియా సంస్థలు సంయమనం పాటించాలని ఆమె కోరారు. తాము దర్యాప్తుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామని, దేశ న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని' శిల్పా శెట్టి పేర్కొన్నారు. బిజినెస్‌మెన్ రంజిత్ బింద్రా స్థాపించిన 'బాస్టియన్ హాస్పిటాలిటీ'లో 2019లో పెట్టుబడి పెట్టిన శిల్పా శెట్టికి ఇందులో 50 శాతం భాగస్వామ్యం ఉంది. బెంగళూరులో అత్యంత ఖరీదైన పబ్‌లలో ఒకటిగా పేరొందిన బాస్టియన్, ఇప్పుడు వరుస వివాదాలతో వార్తల్లో నిలిచింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999